బోర్లకుంట దీపక్‌కుమార్‌కు గ్లోబల్ పీస్ అవార్డు

బోర్లకుంట దీపక్‌కుమార్‌కు గ్లోబల్ పీస్ అవార్డు అందజేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ మధుకిరణ్, ప్రతినిధులు

గోల్నాక, డిసెంబర్ 8: అంబర్ పేటకు చెందిన నేతకాని మహర్ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బోర్లకుంట దీపక్ కుమార్‌కు గ్లోబల్ పీస్ అవార్డు దక్కింది. ఆదివారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బహుజన విద్యార్థి పరిషత్ ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన అసిస్టెంట్ మినిస్టర్ ఆఫ్ ఫారిన్ ఎఫైర్స్ ప్రొఫెసర్ డాక్టర్ మధుకిరణ్, మాజీ డీజీపీ జయచంద్ర తదితరులు బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తున్న దీపక్ కుమార్‌కు గ్లోబల్ పీస్ అవార్డును ప్రదానం చేశారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సిరిచందనరెడ్డి

అంబర్‌పేట, డిసెంబర్ 8: ప్రతిఒక్కరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్య రక్షణకు కృషి చేయాలని సాయిదత్త హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ధనుంజయ అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట, మల్లికార్జుననగర్‌లో డాక్టర్ సిరిచందనరెడ్డి జనరల్ ఫిజీషియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ ధనుంజయ ప్రారంభించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జి డాక్టర్ కుమార్, డాక్టర్ కరిష్మా, డాక్టర్ ఫెర్నాడేజ్, కో-ఆర్డినేటర్, ప్రముఖ సంఘ సేవకులు బోసం వీరబాబు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలి

కాచిగూడ: దేశ వ్యాప్తంగా కులగణన జరిగినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారం అవుతాయని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ అన్నారు. ఆదివారం నింబోలిఅడ్డాలో విలేకరులతో మాట్లాడుతూ బీసీ కులాలవారీగా జనాభా లెక్కలు తెలిస్తే బీసీ రిజర్వేషన్ల అమలు, సంక్షేమ పథకాలు, నిధుల కేటాయింపులకు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు.

నల్లకుంటలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- అతి తక్కువ స్థలంలో కమర్షియల్ భవనాలు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

న్యూరామాలయం ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లు

అంబర్‌పేట, డిసెంబర్ 8: నల్లకుంట డివిజన్‌లోని న్యూ రామాలయం పరిసర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. న్యూరామాలయం పోస్టాఫీసు గల్లీ, శ్రీరామ ఎడ్యుకేషనల్ సొసైటీ పక్క గల్లీ, రామాలయం పరిసర ప్రాంతాల్లో కొంతమంది భవన యజమానులు, బిల్డర్లు 150-200 చదరపు గజాల లోపు స్థలంలో ఏకంగా బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. జీహెచ్ఎంసీ నుంచి జీ ప్లస్ వన్ లేదా టూ అనుమతి తీసుకొని నాలుగైదు అదనపు అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. అదే విధంగా ఏ మాత్రం సెట్ బ్యాక్ లేకుండా తక్కువ స్థలంలో కమర్షియల్ భవనాల నిర్మాణాలు చేపడుతూ పార్కింగ్ స్థలాల్లో సైతం గదులను, అలాగే పై భాగంలో పెంట్ హౌజ్ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్‌కు ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా ఒక్కోసారి టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులకు కనీసం నోటీసులు ఇవ్వడానికి సైతం జంకుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అక్రమ నిర్మాణాలపై భారీగా ఫిర్యాదులు అందితే అక్కడకు వచ్చి సదరు యజమానులకు నోటీసు ఇచ్చి వెళ్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నల్లకుంట డివిజన్ టీఆర్టీ కాలనీలో దేవాలయ పునర్నిర్మాణ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, డిసెంబర్ 8: నల్లకుంట డివిజన్‌లోని టీఆర్టీ కాలనీలో శ్రీ దుర్గామాత దేవాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన ఆదివారం ఉదయం జరిగింది. ముఖ్య అతిథిగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరై పూజలు చేశారు. ఎమ్మెల్యేతో పాటు నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీదుర్గామాత దేవాలయ కమిటీ అధ్యక్షుడు నల్లా నరేశ్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, మురళి, స్వప్న, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

29న బ్రాహ్మణ మహా సమ్మేళనం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, తదితరులు

అంబర్‌పేట, డిసెంబర్ 8: బ్రాహ్మణుల ఐక్యత, అభివృద్ధి, పూర్వవైభవం కోసం రాష్ట్ర స్థాయి బ్రా హ్మణ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బ్రా హ్మణ ఆఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుశీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ తెలిపారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట సీఈ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..బ్రాహ్మణులు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని, వారి అభివృద్ధి, పూర్వవైభవం కోసం ఈనెల 29వ తేదీన రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి మహా సమ్మేళనం నిర్వహిస్తున్నామని, దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ హాజరవుతారని చెప్పారు. దూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ఆహ్వాన కమిటీ కన్వీనర్ వి.పవి. రాంచందర్‌రావు, విష్ణు, శ్రీకాంత్, అసోసియేషన్ ప్రతినిధులు సీతా రామయ్య, వైద్యనాథ్, వేదాంతం పవన్‌కుమార్, ప్రొ. మధుసూదన్‌రావు, విద్యావతి, వాణీరమణి, డాక్టర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ

చిక్కడపల్లి, డిసెంబర్ 8 : బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు మిరింతగా కృషిచేయాలని బీఆర్ఎస్ యువజన విభాగంనాయకుడు ముఠా జయసింహ అన్నారు. బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ డివిజన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఠా జయసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రభుత్వ మోసపూరిత హామీలుపై ప్రజల్లో విస్తృతంగాప్రచారం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, జీవై గిరి, జి.వెంకటేశ్, ఎస్‌టీ ప్రేమ్, ముఠా శివసింహ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



సమావేశంలో పాల్గొన్న మాల సంఘాల నాయకులు, మహిళలు

ఖైరతాబాద్, డిసెంబర్ 8: మాలలపై ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మాల మహిళా చైతన్య వేదిక అధ్యక్షురాలు అంజలి కుమారి అన్నారు. మాలల సింహగర్జన విజయవంతమైన సందర్భంగా ఆదివారం ఖైరతాబాద్ తుమ్మలబస్తీలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాలల సింహగర్జనకు రాష్ట్ర వ్యాప్తంగా మాలలు స్వచ్ఛందంగా వచ్చారని, విజయవంతాన్ని చూసి ఓర్వలేకనే మందకృష్ణ అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. మాలలను చైతన్యం చేసేందుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో బాలనర్సమ్మ, శ్వేత, బి.మంగ, సబిత, మౌనిక, లావణ్య, రేణుకా రాణి, సుభాషిణి, శ్రీధర్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 8: వెలమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.రాజేందర్‌కుమార్ ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఎమ్మెల్యే ఒక కులంను అవమానించడం సరైన విధానం కాదని, ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రం ఖండిస్తున్నట్లు తెలిపారు. వెలమ కులాన్ని దూషిస్తూ, నానా రకాలుగా మాట్లాడిన శంకర్‌పై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

బెంచీలు వితరణ

విశ్వమానవ సంక్షేమ సంఘం (జెక్‌కాలనీ) ప్రతినిధులు ఆదివారం సనత్‌నగర్‌లోని కేఎల్ఎన్ పార్కులో సందర్శకుల కోసం రెండు బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వమానవ సంఘం అధ్యక్షుడు సోమ వెంకట్, వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌రావుతో పాటు జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మల్లుప్రసాద్, డీఆర్ఎస్ చందు కేఎల్ఎన్ పార్కులో జరిగిన ఓ కార్యక్రమంలో వాకింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేశ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ గౌడ్‌లకు బెంచీలను అంకితం చేశారు. – అమీర్‌పేట్, డిసెంబర్ 8

యువతను ఆలోచింపజేసే గ్రంథం

ప్రయాగ మోహనమురళీకృష్ణ రచించిన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 8 : ప్రముఖ రచయిత డాక్టర్ ప్రయాగ మురళీమోహనకృష్ణ యూరప్ దేశంలో 40 ఏండ్ల స్వానుభవాలు, సంఘటనలను వివరిస్తూ విదేశాలల్లో స్థిరపడాలనే యువతకు మార్గనిర్దేశం చేసేలా ఒక మంచి గ్రంథం రచించి అందించారని వక్తలు ప్రశంసించారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం ప్రముఖ రచయిత డాక్టర్ ప్రయాగ మురళీమోహనకృష్ణ రచించిన 'టాప్ హ్యాట్స్ అండ్ టెయిల్ కోట్స్' అనే గ్రంథావిష్కరణ జరిగింది. మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రసంగిస్తూ విదేశీ వ్యామోహంలో ఉన్న యువతకు ఆలోచనరేకెత్తేంచేలా ఈ గ్రంథం ఉందన్నారు. విదేశాలకు వెళ్లిన పౌరుగు దేశాల ప్రజలు పడే ఇక్కట్లను కళ్లకు కట్టినట్లుగా తెలియజేశారని అన్నారు. ప్రముఖ రచయితలు ఓలేటి పార్వతీశం, డాక్టర్ శేషగిరిరావు, భాస్కర్ గడేపల్లి, మెట్ట రామారావు, రచయిత్రులు అత్తలూరి విజయలక్ష్మి, డాక్టర్ ప్రయాగ రాజ్యలక్ష్మి, గాడేపల్లి శశికళ పాల్గొని రచయిత మోహనకృష్ణ సాహిత్య శైలిని వివరించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

కార్వాన్ నియోజకవర్గం సబ్జిమండిలోని గంగపుత్ర సంఘం వారి వీరాభిమన్యు కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని బీజేవైఎం జాతీయ కోశాధికారి పి.ఎం. సాయి ప్రసాద్, కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక సభ్యులు జి. దానయ్య, జి.బసంత్‌రావు, జి.శివరత్నం, ఎం.మహేందర్, జి.చంద్రకాంత్, జి.కిరణ్, జి.శ్రీనివాస్, జి.సంజీవ తదితరులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం, డిసెంబర్ 8

టోలిచౌకిలో పర్యటించిన ఎమ్మెల్యే

కార్వాన్ నియోజకవర్గం టోలిచౌకి ఎండీలైన్స్‌లో సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. ఆదివారం ఎండీలైన్స్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌ను కలిసి బస్తీలో సమస్యలను విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని అన్నారు. – మెహిదీపట్నం, డిసెంబర్ 8

సమస్యల పరిష్కారానికి కృషి

బస్తీవాసులతో మాట్లాడుతున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

బొల్లారం, డిసెంబర్ 8: వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని న్యూ బోయిన్‌పల్లి కడక్‌పురా బస్తీలో సీసీ రోడ్డు పనులు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు మహేశ్వర్‌రెడ్డి బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.ఈ మేరకు బస్తీవాసులు మహేశ్వర్‌రెడ్డి, బోర్డు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు, రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

- మణికొండ

కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతి

కార్పొరేటర్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

అంబర్‌పేట, డిసెంబర్ 8 : అంబర్‌పేట డివిజన్ న్యూఅన్నపూర్ణనగర్ వాసులు ఆదివారం కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. కాలనీలో నెలకొన్న సమస్యలు వీధి దీపాలు వెలగడం లేదని, డ్రైనేజీ సమస్య ఉందని చెప్పారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ వీధి దీపాల నిర్వహణ అధికారులతో మాట్లాడి వెలగని వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని చెప్పారు. త్వరలోనే నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాలనీ పెద్దలు ఎస్.నరసింహా, రఘు, టి.నరసింహా, వెంకటయ్య, దేవేందర్, జి.రఘు, సురేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శారదానగర్ సమస్యల పరిష్కారానికి కృషి

శారదానగర్ కాలనీ అసోసియేషన్ వాసులతో సమావేశమైన కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట, డిసెంబర్ 8: శారదానగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. ఆదివారం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులతో ఆమె సమావేశమై కాలనీలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్‌ను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదవరెడ్డి, కార్యదర్శి శేఖర్య, సభ్యులు సన్మానించారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

అన్నదానం చేస్తున్న బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు

అబిడ్స్, డిసెంబర్ 8: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు అన్నారు. నాంపల్లిలోని కాశీవిశ్వనాథ ఆలయం వద్ద లయన్స్ భోజనాలయ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి విచ్చేసిన లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. లయన్స్ భోజనాలయ్ చారిటబుల్ ట్రస్ట్ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు.